# నందనవనం - 18

‘‘నాకది ఓ తీయని జ్ఞాపకం... నేను దూరం నుండే ఇష్టంగా గమనించే బుల్లి నోరున్న మల్లిపూవంటి అమ్మాయి... తనంతట తానుగా వచ్చి .. నా కవితను మెచ్చుకోవడం... ఆరోజు మాత్రమే కాదు, తలుచుకున్నపుడల్లా... నన్ను గాల్లోకి ఎగరవేసేది! నిజం.... తర్వాత... చాలానాళ్ళకి మళ్ళీ పరిచయం కొత్తగా కలిగి... ప్రేమగా మారాక కూడా నేను ఆ బుల్లి పెదవుల్ని ఎంత ఇష్టంగా చూసేవాడినో...! ఇపుడైతే... విసురుగా మాటలు రువ్వుతూ... ఆ మూతిని అటూ ఇటూ తిప్పటం... అబ్బ....! అదీ ఎంత ముద్దుగా ఉంటుందో... అలా చూసినపుడెంత మత్తెక్కిపోతుందో..!’’ అంటూ ఆయన హాయిగా నవ్వాడు.

‘‘నువ్వెప్పుడూ నా పర్సనల్ వస్తువుల్ని చెక్ చేసినట్లుగా చూడవు కనుక.. ఎపుడూ నా వెంటే ఉంచుకునే ఈ నోట్ బుక్‌ను నువ్వు చూడలేదనుకుంటా. చూసినా.. ఆ పేజీ మాత్రం కనుపించలేదేమో...! నిజం చెప్పాలంటే.... నీ ఫ్రెండ్స్ అన్నట్లు.... మొదటి లైన్లన్నీ నిన్ను దృష్టిలో పెట్టుకుని రాసినవే... అయితే.... ఆ విషయం పట్ల నీకు అభ్యంతరం లేదనే సంగతీ తెలిసింది కదా!

ఎందుకనో గానీ, నీకు గుర్తేమీ లేనపుడు... నేనెందుకా విషయం జ్ఞాపకం చేయాలీ అనుకుని వూరుకున్నాను! మనం ఇక్కడకు వస్తున్నపుడు కూడా నువ్వు.... ఇక్కడకు దగ్గరలోనే ఉన్న పట్నంలో కొన్నాళ్ళు చదువుకున్నానన్న సంగతి మాత్రమే చెప్పావు..!

నేనెంతో పదిలంగా నా మనసులో దాచుకున్న విలువైన జ్ఞాపకం.... నీకు చాలా మామూలు విషయంగా అనిపించి తేలికగా మర్చిపోయావనిపించీ నీకు గుర్తు చేయాలని నాకూ అనిపించలేదనుకుంటా!

ఆ హైస్కూలు రోజుల్లో.... ఒక పాట నాకు చాలా ఇష్టంగా ఉండేది. ముఖ్యంగా అందులోని ఒక చరణం... 'సమ సమాజ నిర్మాణమే నీ ధ్యేయం ` సకల జనుల సౌభాగ్యమే నీ లక్ష్యం...' అని ముందుగా నిన్ను దృష్టిలో పెట్టుకుని ఆ కవిత మొదలు పెట్టినా గానీ, మధ్య వాక్యాల్లో నాకు బాగా నచ్చిన ఆ కవి మాటల భావాన్నే వ్యక్తీకరించటానికి ప్రయత్నించాను.

'ఆ తర్వాతెందుకూ ఏం రాయలేదూ...' అని అడిగితే మాత్రం ఆ రోజుల్లో.... నువ్వు కలిగించినట్లుగా ఏ అమ్మాయీ ప్రేరణ కలిగించక పోవటంతో నేనూ రాయాలని ప్రయత్నించలేదు! ఇపుడు మాత్రం మళ్ళీ అలాంటి కవిత్వం రాయటానికి  ప్రయత్నం చేద్దామా... అనిపిస్తోంది సుమా..!'' అంటూ ఆయన పెద్దగా నవ్వాడు.

''అవును.... ఆ రోజు.. అలాంటి ప్రయత్నమేదో చేసారుగా... 'బువ్వట్టుకొచ్చిందీ బుల్లెమ్మా' అనీ... అంటూ శ్రీవల్లీ పకపకనవ్వి ''ఇక వద్దు లెండి...!'' అనేసింది.

''ఏం....?'' అన్నట్లుగా చూశాడాయన.

''కవిత్వంతో పని ఏముందీ... మీ ఆశయం ఏమిటో ఆచరణలోనే పెడుతున్నారుగా! పాట కంటే... పనే చాలా గొప్పది! పాట లక్ష్యం.. పని చేయటానికి ప్రోత్సహించటమేగా! అరుగుల బడి మళ్ళీ గుర్తు చేస్తూ... సమావేశాల్లో మీరు చేస్తున్నదేమిటీ... కులాల అడ్డుగోడలు ఉండకూడదంటూ, ఎన్నెన్నో సూక్తులూ, కథలూ

చెప్పుకొస్తున్నారా... అంటే పరోక్షంగా సమసమాజాన్ని సాధించాలనే ప్రోత్సాహమేగా..! ఇప్పటికే నాలుగైదు కులాంతర వివాహాలూ జరిపించారు కదా...?'' అంది శ్రీవల్లి.

''వాళ్ళకిష్టమైంది... నేను ధైర్యం మాత్రం కలిగించాను! అంతే తప్ప... ఆశయమంటూ నచ్చ చెప్పి ఎవరికీ వివాహాలు జరిపించలేదుగా..! పిల్లలకు ఒకరంటే ఒకరికి ఇష్టమై.. వాళ్ళు పెళ్ళికి సిద్ధపడితే. పెద్దవాళ్ళు తమ అభ్యంతరాలను నచ్చ చెప్పటానికి ప్రయత్నించాలి, అంతే గానీ కులం ఒక్కదానివలనే విముఖత చూపించకూడదనేది నా అభిప్రాయం. అన్ని విషయాల్లో సరితూగటమనేదీ ముఖ్యమే కానీ కులం ఒక్కటే మాత్రం కారణం కాకూడదని నేను నమ్మాను.... ఆ విషయాన్ని పదిమందికీ చెప్పే ప్రయత్నం చేస్తున్నాను.... ఇలాంటి అవకాశం వచ్చింది కాబట్టి..'' అంటూ నిట్టూర్చి మళ్ళీ అన్నాడు.

''ఏ మార్పు అయినా క్రమేపీ వస్తుంది గానీ వెంటనే కనుపించదు. కేవలం మాటల్లోనే కాకుండా, చేతల్లోనూ... అంటే.... చేసే పనుల్లోనూ మనం చెప్పేది కనుపిస్తే.. అప్పుడు అందరూ దాని గురించి ఆలోచిస్తారు...! అవునా... ఇప్పుడు చూడు ... కొంచెం మార్పు వచ్చినట్లే నా కనిపిస్తోంది.. మనం వచ్చినప్పుడు.. ఎక్కువ కులం అని భావించిన రైతు... పక్కనే ఉన్న కులం తక్కువ వాడి పొలం కౌలుకు తీసుకోవద్దంటూ మనల్ని హెచ్చరించాడా, అలా వీలు కాకపోయేసరికి.... ఏదో గొడవ చేద్దామనుకున్నా కుదరక రాజీపడ్డాడు. అందరూ కలిసి ఏ నిర్ణయం తీసుకున్నా... తప్పకుండా అమలవుతుంది! అందుకనే మనకు మంచి అనిపించిన నిర్ణయాలను అమలు చేయటంలో వెనకడుగు వేయాకుడదనుకుంటాను ! ప్రస్తుతం మంచి అనుకునే విత్తనాలను పదిమందిలో నాటుకోవటానికి పెదజల్లే ప్రయత్నమే మనం చేస్తున్నాం... అది మొలకెత్తాలనే ఆశా ఉంది! ఫలితం అనేది కాలమే నిర్ణయిస్తుంది! ''

శ్రీవల్లి చిన్నగా నిట్టూర్చింది. ''అవును.... మీ తాతగారి ఆశయాలను, ఆశలను కొనసాగించే ప్రయత్నం మళ్ళీ మనం చేస్తున్నాం... అంతేగా!''

అపుడే అక్కడికి వచ్చిన ఓ తెల్లపిల్లి అటుగా గెంతుతూ పరుగెత్తింది! దానిని చూడగానే ఆయన పెదవుల పైకి చిరునవ్వు వచ్చింది.

ఎందుకన్నట్లు శ్రీవల్లి చూసింది.

''ఆ తెల్లపిల్లిని చూడగానే... మనం ఇందాక వెళ్ళొచ్చిన స్కూలు రోజుల నాటిదే ఒక విషయం గుర్తుకు వచ్చిందిలే...! అప్పట్లో క్లాసులోని నా ఫ్రెండ్సంతా నీకో నిక్‌నేమ్ పెట్టారు... బావురుపిల్లి అని ! నీ ప్రస్తావన వస్తే చాలు... ''శ్రీవల్లీ... బావురుపిల్లీ'' అని రాగం తీసేవారు. కొందరేమో... తెల్లపిల్ల అనో లేక తెల్లపిల్లి అనో తేడా తెలియకుండా మాట్లాడేసేవాళ్ళు. మరికొందరేమో మాటల్లో..... 'ఏ కొంచెం తేడా కనిపించినా, మీదపడి కళ్ళు పీకేస్తుందనే భయమేస్తుంటుందిరా బాబూ... 'బావురుపిల్లి' అనే పేరే సరిగ్గా సరిపోతుంది!' అంటూ  భయం నటించేవాళ్ళు! అయితే క్లాసు మొత్తానికి అందమైన, తెలివైన అమ్మాయివి నువ్వే కాబట్టి... అందరం నీ గురించే ఎక్కువ కబుర్లు చెప్పుకునే వాళ్ళం. నీతో మాటలు కలపాలన్న కోరిక ఉన్నా భయం కొద్దీ... ఆ సాహసం ఎవరూ చేసేవాళ్ళు కాదు! అలాంటిది ఆ రోజు నీ అంతట నువ్వే నా దగ్గరకు వచ్చి మేగజైన్ లో వచ్చిన నా కవితను బావుందంటూ మెచ్చుకోవడం చూసి.... అందరూ నా అదృష్టాన్ని తెగ మెచ్చేసుకున్నార్లే... తర్వాత తర్వాత నీతో జీవితాన్నే పంచుకోగలిగే అదృష్టమూ నాకు దక్కుతుందనే విషయం... అపుడు నేనూ ఊహించలేదనుకో...!''

ఆయన మాటలకు శ్రీవల్లి చిన్నగా నవ్వింది. ''ఆ రోజుల్లో... మన అందరిలో చక్కని స్నేహభావమే తప్ప... ప్రేమా, దోమాలాంటి పిచ్చి ఆలోచనలేవీ ఉండేవి కావు.

అందుకే నేమో... నేనూ ఎటువంటి సంశయం లేకుండా, మీ దగ్గరకు వచ్చి ఆ కవిత నాకు నచ్చిందనే విషయాన్ని చెప్పేసాను! నాకలాంటి నిక్‌నేమ్ ఉందనే మాట తెలియదుగానీ... ఒకసారి మాత్రం.... ఎవరో మన స్కూలు కుర్రాడే అనుకుంటా... నేను వస్తోంటే... వెనకనుండి 'తెల్లతోలు పిల్లా... నిను చూడాలనిపిస్తోందే మళ్ళా మళ్ళా...' అంటూ రాగం తీసాడు.

నేను కొంచెంగా వెనక్కి ఎవరా అని చూసేసరికి.. కొయ్యలా నిలబడి పోయాడు! భయంతో బిక్కచచ్చిపోయినట్లు బిగుసుకు పోయిన వాడిని చూస్తే... నవ్వొచ్చింది! వెంటనే వెనుదిరిగి నా దారిన నేను వెళ్ళి పోయాను!'' అంటూ ఒక క్షణం ఆగి ''ఇప్పుడు మనం కూడా ఆ పిల్లిలాగే గెంతులు వేసుకుంటూ ఆరోజుల్లోకి వెళ్ళి... వెనక్కి వచ్చేసాం కదూ! ఆరోజులు... మన పరిచయం..... స్నేహం... ప్రేమా పెళ్ళీ... అన్నీ  ఎంత త్వరగా జరిగిపోయాయీ అనిపిస్తోంది! అపుడే... మనం మన పిల్లాడికి పెళ్ళి చేసే వయసుకు వచ్చేసాం..... కూడా! ఆశ్చర్యంగా లేదూ..?'' అంది.

''ఆశ్చర్యం కంటే... ఆనందమే ఎక్కువ! ఎందుకంటే... అన్ని దశల్లోనూ జీవితాన్ని ఆనందంగా ఆస్వాదించగలిగే అదృష్టం దక్కింది కాబట్టే కదూ...! నీకే ఈ పల్లెటూరు జీవితం.....పెంకుటిల్లూ.... కొంచెం అసౌకర్యంగా ఉందేమో..!'' ఆయన నిట్టూర్చాడు.

''ఈ ఊళ్ళో.... ఈ ఇంట్లో కొన్ని సౌకర్యాలు తక్కువే అయినా.. ఎపుడూ రుచి చూడని ఆనందాలూ ఎన్నెన్నో ఉన్నాయిగా..! పల్లె వాతావరణం నాకు కొత్తేమోగానీ.... చిన్న ఇల్లు మాత్రం కాదు. నా దృష్టిలో కుటుంబంతో కలిసి మనం ఎంత ఆనందంగా గడుపుతున్నామనేదే ముఖ్యంగానీ.... ఇల్లు వైశాల్యానికి అంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన పని లేదు...! గొప్ప వాళ్ళతో పోల్చుకోవటం కాదుగానీ... ఒక మాట చెప్పాలనిపిస్తోంది!

అంతఃపురంలో అయినా, వనవాసంలో అయినా సీత ఒకేలా ఆనందంగా ఉండటానికి ప్రధాన కారణం రాముడి సహచర్యం వలనే! అవునుకదూ...?''

శ్రీవల్లి మాటలకు ఆయనా చిరునవ్వు చిందించాడు.

* * *

మళ్ళీ ఆ ఊళ్ళో ఒక వార్త గుప్పుమంది!

అంతకు ముందులాగానే.... సుబ్బయ్య గారిని భద్రయ్య ఇంటి పక్కల చూసామని కొందరు చెప్పటం జరిగింది... ఇంకొందరు ఎవరో ఆవిడనో, అమ్మాయినో భుజం చుట్టూ చేయివేసి పొదివి పట్టుకుని అక్కడ ఆపివున్న కారులో ఎక్కించుకుని వెళ్ళటం చూశామనీ చెప్పారు!

అయితే ... ఆ సమయంలో సుబ్బయ్య గారిని వారి ఇంటివద్దనే చూశామనీ చాలామంది అలాగే నొక్కి వక్కాణించారు ! రచ్చబండ సమావేశంలా వాళ్ళ ఇంటిదగ్గర ఊళ్ళోవాళ్ళు చాలామంది కథలూ కబుర్లతో కాలక్షేపం చేస్తున్న సమయంలోనే.. అలాంటి సంఘటనలు జరగటమేమిటన్నది అందరికీ అర్థం కాని ప్రశ్నగా కలవర పెట్టింది ! మునుపటిలా ఎవరినో చూసి సుబ్బయ్యగా భ్రమపడ్డారేమో అనుకోవటానికీ వీలులేకుండా పోయింది! ఎందుకంటే.... అక్కడ చూశామన్న వాళ్ళూ, ఇంట్లో చూసామన్న వాళ్ళూ కూడా నమ్మదగిన వాళ్ళే మరి!

కొందరు చనువుగా ఆయననే అడిగారు ''ఎప్పుడో ద్వాపరయుగంలో కృష్ణుడు కొన్ని సార్లు అలా కనిపించేవాడని విన్నాం...! అది భగవంతుడి లీల అని నమ్మాంగానీ... ఈ రోజుల్లో.... ఇలాంటి చోద్యం... వింతగా లేదూ....? నువ్వే ఆ మర్మమేమిటో చెప్పవయ్యా....!'' అని.

దానికాయన చిన్నగా నవ్వేసి ''మీరే అంటున్నారుగా చోద్యం, వింత అని! ఇక్కడ మీతో మాట్లాడుతున్నది 'నువ్వు కాదూ, అక్కడెలా కనుపించావు' అనడిగితే నేను మాత్రం జవాబెలా చెప్పగలనో చెప్పండీ..?'' అని ఎదురడిగేసరికి వాళ్ళూ ఏం చెప్పాలో తెలియక మౌనం వహించారు.

మొత్తానికీ వార్త పెద్ద సంచలనమే సృష్టించింది! ఆవూరి జనమే కాదు పొరుగూరు వాళ్ళూ ఈ వింత గురించే చిలువలు, పలవలుగా చెప్పుకోవటం జరిగింది.

మాటల మధ్య కూపీ లాగవచ్చనుకుంటే, ఎవరికీ అదీ కుదరలేదు. కానీ ఆ ఇంటికి వచ్చే వాళ్ళ సంఖ్య మాత్రం విపరీతంగా పెరిగింది. మొదట్లో ఆయన, శ్రీవల్లి కొంచెం శాంతంగానే చిరునవ్వుతోనే తమకు మాత్రం ఆ విషయం ఎలా తెలుస్తుందని బదులు చెప్పేవాళ్ళు.

చివర చివరకు అలా ప్రయత్నించేవాళ్ళ సంఖ్య పెరగటంతో వాళ్ళకూ చిరాకు పెరిగింది. ఆ చిరాకు... వారి సమాధానాల్లోనూ కనిపించేసరికి.. వాళ్ళకీ నోటికి తాళం పడినట్లయింది! అయితే... ఒకతను మాత్రం... ఏదో జరుగుతోందనే అనుమానానికి ఊతమిచ్చేలా భద్రయ్యకు ఒక సమాచారం చేరవేశాడు. సరిగ్గా ఆ సమయంలోనే అందరి మధ్యా కూర్చుని కబుర్లు చెబుతోన్న సుబ్బయ్య మొహంలో కొంచెం ఆందోళన కనిపించిందనీ, ఎవరి దగ్గర్నుండో ఫోను రాగానే లోపలకు వెళ్ళి మాట్లాడటం జరిగిందనేది ఆ వార్త సారాంశం.

అతనికీ ఏదో అనుమానం వచ్చి... ఏదైనా విషయం తెలుస్తుందేమోనని ఆటుపక్కకి వెళ్ళి కిటికీ దగ్గర కొంచెం చాటుగా నిలబడి చెవులు రిక్కించి విన్నాడు.. అతను సరే, సరేనని అనటం, రెండు నిముషాల్లోనే మళ్ళీ అందరి మధ్యా కూర్చున్న

ఆయనలో.... అంతకు ముందు కనిపించిన కలవరం లేశమాత్రం కూడా లేకపోవటమే కాక, బరువు తీరినట్లు, చాలా కులాసాగా కనిపించాడనే వార్తను వివరించాడతడు! ఈ కబురులోని నిజా నిజాలేమిటో తెలుసుకోవాలనే ఉత్కంఠ భద్రయ్యలో పెరిగిపోయింది.

ఏమాత్రం ఆలశ్యం చేయకుండా ఆ మరునాడే వాళ్ళింటికి బయలుదేరి వెళ్ళాడు.

వెళ్ళే సరికి.. అతని కంటబడిన దృశ్యం అతని మతి పోగొట్టింది! ఎప్పుడూ వాళ్ళిద్దరి మధ్యా... చిరుచిరుకోపాల మురిపాలూ, విరిజల్లుల్లాంటి పరిహాసాలూ మాత్రమే చోటుచేసుకునేవి! దంపతులందరి మధ్యా సహజంగా ఉండే ఎత్తి పొడుపులూ, ఘాటు విమర్శలూ అస్సలు ఉండేవికావు! అందుకే ఊరు వాళ్ళంతా వారి అన్యోన్యత గురించి గొప్పగా చెప్పుకునేవాళ్ళు. కొందరు వాళ్ళు.... సీతారాములను గుర్తుకు తెస్తారని అంటే... మరికొందరు 'సాక్షాత్తూ పార్వతీ పరమేశ్వరులే అనిపిస్తారుకదూ' అంటూ మెచ్చుకునేవాళ్ళు!

కానీ ఆరోజు... భద్రయ్య వెళ్ళేసరికి ఇద్దరూ ఎడమొహం, పెడమొహంగా ఉన్నారు! వారు ఆయనను చూసీ చూడగానే... ఒకరిమీద మరొకరు ఆరోపణలు గుప్పించేశారు!

''అన్నయ్యగారూ... చూడండి... ఈయన నిర్వాకం! ఊరంతా కోడైకూస్తుంటే... పాపం ఈయనకేం తెలియదంటూ బుకాయిస్తున్నారు! అందరి సంగతీ ఏమోగానీ, కట్టుకున్న నాకైనా నిజం చెప్పాల్సిన పనిలేదా...? ఎవరినో కారులో ఎక్కించుకుని వెళ్ళటం చూశామని కొందరు అంత నిక్కచ్చిగా చెబుతున్నారుగా. 'ఎవరావిడ... మీకేమిటి సంబంధం...?' అని అడిగే హక్కు నాకు లేదా...? నిజం ఏమిటో చెప్పాల్సిన బాధ్యత ఆయనకూ ఉందిగా....?''

శ్రీవల్లి ఆరోపణలను ఆయన వెంటనే ఖండిస్తూ ''ఆ సమయంలో నేను తన కళ్ళముందే ఉన్నాననే నిజం ఆవిడకూ తెలుసు! నేను ఇంట్లోనే ఉన్నపుడు... వేరెవరినో నేను వెంటబెట్టుకు వెళ్ళాననే మాట నమ్మడమే కాకుండా... ఆవిడెవరో చెప్పాలంటూ నిలదిస్తే నేను జవాబేం చెప్పగలనో చెప్పండీ...?'' అని ఎదురడిగేసరికి, భద్రయ్య తల పట్టుకున్నాడు.

''పాపం....! మీకేమీ తెలియదా...? మీరక్కడ లేనిమాట నిజమేమోగానీ, మిమ్మల్ని కళ్ళారా చూసామని చెప్పినవాళ్ళమాట కల్ల అని కొట్టేయలేంగా... వాళ్ళూ ఈ ఊరి పెద్దమనుష్యులేగా... అసలు నిప్పులేకుండా పొగవస్తుందా....?'' అంటూ శ్రీవల్లి మళ్ళీ గట్టిగా నిలదీసింది.

''అయితే మాత్రం... నా మాటలకేం విలువ లేదా....? నిప్పు లేకుండా పొగ ఎలా వచ్చిందో, ఆ మర్మం ఏమిటో తెలుసుకోవాలిగానీ, ఏమీ తెలియని నన్ను.... ఎంత గట్టిగా, గద్దించి అడిగినా... ఏం చెప్పగలనూ...? ఇందులో నా పాత్ర, ప్రమేయం ఏమీ లేదని నిరూపించుకోవటానికి.... నేనేం చేయాలీ...? భద్రయ్యగారూ... ఆవిడనే చెప్పమనండీ ఆరోజుల్లో... తన శీల నిరూపణకు సీత అగ్ని ప్రవేశం చేసినట్లు... నిజం నేనెలా నిరూపించు కోవాలీ...?''

ఆయన ప్రశ్నకి శ్రీవల్లి చురుగ్గా చూసింది. ''సీతపట్ల తన కెంతో ప్రేమా, నమ్మకం ఉన్నపుడు... అలాంటి పరీక్షని అంగీకరించటం తప్పని రాముడంతటి వాడినే... మాలాంటివాళ్ళం ఇప్పటికీ ఆడిపోసుకుంటూనే ఉన్నాం! మరినేను అదే తప్పును చేయాలనుకోవటం లేదు! నలుగురినీ నమ్మించాల్సిన అవసరం ఏమిటసలూ... మీరేమిటో నాకు తెలుసుకదా...!'' అంటూ ప్లేటు మార్చినట్లుగా మాట్లాడిందది.

వీళ్ళిద్దర్నీ మాటల్లో పెట్టి.... ఏదో పసిగట్టాలని వస్తే... వీళ్ళిద్దరూ ఇలా ఘర్షణ పడుతూ... వాళ్ళు తన తీర్పును కోరటం ఏమిటీ... ఏం చెప్పాలో తెలియక తను తికమక పడటం ఏమిటీ' అనే ఆలోచనతో సతమతమవుతున్న భద్రయ్యకు చివరగా శ్రీవల్లి కొంచెం సర్దుబాటు ధోరణి చూపించటంతో, స్థిమితపడినట్లుగా నిట్టూర్చాడు.

''అమ్మాయ్... నేను మీ ఇద్దరి వాదనలో పడి... నేను వచ్చిన పని మరిచేపోయా. రేపు మా ఆవిడ ఏదో వ్రతం పేరు చెప్పింది. గుర్తులేదు. అయితే మాత్రం ఏమయిందిలే అమ్మా.... రేపు నువ్వు మా ఇంటికి భోజనానికి వచ్చి తాంబూలం తీసుకువెళ్ళాలని చెప్పమంది. నిన్ను తోబుట్టువులా భావించి... రమ్మంటున్నాను... మరి ఈ అన్నయ్య మాట కాదనకూడదు...!'' అన్నాడు భద్రయ్య.

శ్రీవల్లి ఆనందంగా చూసింది. ''తప్పకుండా వస్తాను మీరంత ఆప్యాయత చూపించటమే నాకెంతో సంతోషకరమైన విషయమండీ!'' అంది.

శ్రీవల్లి మాటలకు భద్రయ్య మొహం విప్పారింది.

''మంచిదమ్మా... కులాల పట్టింపు ఉందేమో, ఏమంటావో నని నాకు మనసులో కొంచెం సందేహం ఇప్పటివరకూ ఉంది. ఇపుడు నీ మాటలతో అదీ తీరిపోయింది! అయితే ఇక నేను వెళ్ళొస్తాను...'' అంటూ సెలవు తీసుకుంటున్నట్లుగా ఇద్దరి వైపూ చూశాడు.

''అయ్యో.... మాటల్లో పడి మరిచేపోయాను... ఒక గ్లాసు మజ్జిగ అయినా తీసుకువస్తాను...'' అంటూ శ్రీవల్లి హడావుడిగా లేచేసరికి ''ఇపుడేం వద్దమ్మా...'' అంటూ భద్రయ్య బయటకు వడివడిగా అడుగులు వేసాడు. బయట అరుగుల మీద వేచి ఉన్న తన అనుచరులతో కలిసి చకచకా వెళ్ళబోతూ... తడిక గేటు దగ్గరకు వచ్చిన

ఆయన ‘‘అయ్యో... చేతిలోని గొడుగు అక్కడ మర్చిపోయినట్లున్నానే....’’అంటూ వెనుదిరగబోతోంటే... ఆయన అనుచరుల్లో ఒకడు ‘‘లేదండీ... నా దగ్గిరే ఉంది....’’ అంటూ చూపించాడు. అలా ఆయన ఆలోచనకు అతను అడ్డుపడ్డాడు. తప్పనిసరై భద్రయ్య చిరాకు నణుచుకుని ముందుకు నడిచాడు. వెనక్కి వెళ్ళి వాళ్ళ పరిస్థితి చూసి ఏదో అంచనా వేయాలని అనుకున్న ఆయన ఆలోచన అలా వీలు కాకుండా పోయింది.

వెనక్కి గానీ తిరిగివచ్చి ఉంటే... అప్పటి వరకూ మాటలు ఈటెల్లా విసురుకున్న ఆ దంపతులిద్దరూ ఒకరినొకరు చూసుకుంటూ గుంభనంగా నవ్వుకోవటం కనిపించి ఉండేది! అనుమానాలను నివృత్తి చేసే ఓపిక లేకనే అలా వాళ్ళిద్దరూ జగడంతోనే సరదాగా జవాబు చెప్పటం జరిగింది!

ఉదయమే ఫోను మ్రోగుతోంటే... దుప్పట్లో ముడుచుకుని పడుకుని బద్ధకంగా దొర్లుతున్న రామం చేయిచాపి ఫోను అందుకున్నాడు. ఆన్ చేసి ‘‘నందూ... ఇంత పొద్దునే చేసావేం...?’’ అనడిగాడు.

‘‘ఏమిటో.... ఈ రోజు తెల్లవారు రa◌ామునే మెలకువ వచ్చేసింది. సూర్యోదయం చూద్దామని సరదా పుట్టి.... ఇంటిముందుకు వచ్చానా... పక్కింటి అమ్మాయిలు ఇం.....త పెద్ద ముగ్గు వేస్తూ... కనిపించేసరికి... అలా చూస్తూ నిలబడిపోయాను. నేనూ మా ఇంటిముందు వేద్దామని

ఉత్సాహపడితే... మా అమ్మ వద్దంది.’’

‘‘ఏం.... ఎందుకనీ...? ముగ్గులు వేయటం తప్పు పనేం కాదుగా...?’’

''కాదుగానీ.... ఇక్కడున్న నాలుగు రోజులూ ఇలాంటివన్నీ ఎందుకూ... తీరిగ్గా కూర్చో... ఆ తరువాత అత్తారింటికి వెళ్ళాక... ముద్దూ ముచ్చట్లతో పాటూ పనీపాటలూ తప్పవుగా...' అంది అమ్మ మాటలు సాగదీస్తూ. నేనప్పుడే ఈ ఇంటికి కానిదాన్ని అయిపోయానన్నమాట! నాకు సరదా ఉంటే, మీ ఇంటిముందే ముగ్గులు వేసుకోమని తేల్చి చెప్పేసింది...!''

''ఏదో మాట వరసకి ఆమె అంటే... నువ్వు పొద్దున్నే ఫోనుచేసి... ఈ ముగ్గుల బొగ్గుల కథలేమిటీ చెప్పూ.... ఏపైనా కమ్మని కబుర్లు చెప్పక...''

కొంచెం చిరాకు పడుతున్నట్లుగా ధ్వనించాయి అతని మాటలు.

''సరేసరే... మీకేదో అర్థమౌతుందనుకున్నా...కానీ ఏమాత్రం బోధ పడలేదని నాకర్థం అయింది! నేనే చెబుతున్నానిక... ముగ్గులని తేలిగ్గా మాట్లాడకండి. ముగ్గుల్ని రంగవల్లులనీ అంటారు తెలుసుగా. రంగు రంగుల పూలరేకులతో ఇంటిముందు అందంగా అమిరే ముగ్గు ఇంటికి ఎంతందం తీసుకువస్తుందో...! అలా ఇంటి గుమ్మం దగ్గర్నుండి మొదలు పెట్టి ఇంటిని చూడముచ్చటగా తీర్చిదిద్దుకునే బాధ్యత కోడలికీ ఉంటుందిగా... అందుకే మీ ఇంటిముందు ముగ్గులు వేసి నా నైపుణ్యం మీ అందరికీ చూపించమని మా అమ్మ ఇలా చెప్పిందన్నమాట...! ఇపుడైనా అర్థమైందా మరీ...?''

''ఏమిటో నందూ... నాకు తెలిసీ తెలియనట్లుగా అనిపిస్తోంది! ముగ్గువేయటానికి ఇంత తికమకలెందుకూ... మా ఇంటిముందు నీకిష్టం వచ్చినంత పెద్ద ముగ్గు వేసుకో... ఎవ్వరం కాదనం...!''